క్లుప్తంగా

రైతులకు వరి విత్తనాలు పంపిణీ



దుగ్గిరాల: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై రైతు సేవా కేంద్రాల ద్వారా ఇచ్చే వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో బుధవారం ఆమె 200 మంది రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. వరి విత్తన 24 గంటల లోపు పెండి మితాలిన్ అనే మందు ఎకరాకి ఒక లీటరు చొప్పున పిచకారీ చేయాలని ఏఓఆర్ విజయ బాబు తెలిపారు. తుమ్మపూడి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఏఓఆర్ విజయబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి

దుగ్గిరాల: సామ్యవాదం, లౌకిక భావనలు రాజ్యాంగానికి జీవం, ఊపిరి అని ఎమ్మార్పీఎస్ ఏపీ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానవ హక్కుల విధాత అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రమాదంలో పడిందని అన్నారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగ మరణ ఘంటికలు మోగిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ పీఠిక నుంచి సామ్యవాద, లౌకిక పదాల భావనలను తొలగించాలన్న వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

విద్యుత్ వినియోగదారులపై భారాలు వేయొద్దు



మంగళగిరి టౌన్: స్మార్ట్ మీటర్లు బిగించి విద్యుత్ వినియోగదారులపై కూటమి ప్రభుత్వం భారాలు వేయడం సరికాదని సీపీఎం నాయకులు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని రత్నాలచెరువులో బుధవారం స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. దీనిపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్ల విద్యుత్ వినియోగదారులపై భారం వేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పిల్లలమర్రి బాలకృష్ణ, శివచంద్రరావు, గణేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ గుప్పెట్లో మోదీ ప్రభుత్వం



మంగళగిరి టౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో ఉందని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆరోపించారు. మంగళగిరి నగరపరిధిలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం పట్టణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాలు, విద్యుత్ స్మార్ట్ మీటర్ల దోపిడీపై మండిపడ్డారు. ఈనెల 6న జరిగే పార్టీ పట్టణ 26వ మహాసభను, 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

దుగ్గిరాల: కార్మికులకు నష్టం కలిగించి.. యజమానులకు లాభాలు సమకూర్చే అనుకూల చట్టాల ద్వారా కార్మికులకు తీరని ద్రోహం జరుగుతుందని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అన్నారు. దుగ్గిరాల పసుపు యార్డులో బుధవారం కార్మికులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం పసుపు యార్డు సెక్రెటరీ జె.వి. సుబ్బారావుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఎం.నాగేశ్వరరావు, ఏడుకొండలు, సాంబశివరావు, బి.అమ్మిరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

‘పొలం పిలుస్తోంది’లో రైతులకు అవగాహన

తాడేపల్లి రూరల్: పెనుమాకలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష మాట్లాడారు. కార్యక్రమంలో రైతులకు వరి సాగులో కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వరి విత్తిన 24 గంటలలోపు పెండిమితాలిన్ అనే మందును ఎకరానికి 1 లీటర్లు పిచికారీ చేసుకోవాలని వివరించారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఇ–పంట పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి దీపిక, టీడీపీ నాయకులు కొల్లి శేషు, కళ్లం రాజశేఖరరెడ్డి, ఏఈవో రమేష్‌బాబు, పావని, వీహెచ్ఏ నాగమణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి శిరీష



మాట్లాడుతున్న మంగళగిరి సబ్‌డివిజన్ ఏడీఏ శ్రీనివాసరావు

తాడికొండ: రైతులు వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి వాటికి బదులుగా జీవ సంబంధమైన ఎరువులు, శిలీంధ్ర నాశనుల వాడకం పెంచాలని మంగళగిరి వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ టి.శ్రీనివాసరావు సూచించారు. తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి, ముక్కామల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పంట వేసిన ప్రతి రైతు తాము పండించే పంటను రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియజేసి పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని కోరారు. లాం ఫాం శాస్త్రవేత్త సీహెచ్ లతవాణి ప్రస్తుతం పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వాడకం వంటి పలు అంశాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాయక్, పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మునగ పంటతో అధిక లాభాలు

ఫిరంగిపురం: మునగ పంట వేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మీ అన్నారు. మండలంలోని అమీనాబాద్ పంచాయతీ బి.పెదరత్తయ్య ఆవరణలో బుధవారం రైతులకు మునగ పంట లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ.. మునగ పంట వేసుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనం నాటిన మొదలు పంట చేతికొచ్చే వరకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మునగ పంటతో కలిగే ఆరోగ్య విలువలు తెలియజేశారు. వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ.. రైతులు తమ భూములు సారవంతంగా మార్చేందుకు నవధాన్యాలు విత్తణాలు వేసుకోవాలని చెప్పారు. దానిని కలియ దున్నడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, ఏపీవో కిరణ్మయి, సుబాని, సీసీలు కరిముల్లా, నరసింహారావు, మోడల్ మేకర్లు ఇ.వెంకటేశ్వర్లు, అన్నామణి, రామకృష్ణ, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మీ

మహానాడులో పర్యటించిన మంత్రి లోకేష్

తాడేపల్లి రూరల్: ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో బుధవారం విస్తృతంగా పర్యటించారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భూముల వివరాలుఇవ్వాలని వినతి

ఫిరంగిపురం: మండంలోని పలు గ్రామాల్లో అటవీ భూములు, అసైన్డు భూమలు నకలు ధృవీకరించి భూముల వివరాలు అందజేయాలంటూ జనసేన నాయకులు కోరారు. ఈ సందర్భంగా నాయకులు తహసీల్దార్ జె.ప్రసాదరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారికి మణిపాల్‌లో అరుదైన శస్త్రచికిత్స

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పటల్‌లో ఓ చిన్నారికి అరుదైన చికిత్స నిర్వహించి విజయవంతం చేసినట్లు మణిపాల్ హాస్పటల్ డైరెక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్ల చిన్నారి కాలినొప్పితో బాధ పడుతూ తమ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు తీసుకువచ్చారని అన్నారు. అనేక పరీక్షల అనంతరం ఎవింగ్స్ సర్కోమా అనే అరుదైన, ప్రమాదకరమైన ఎముక క్యాన్సర్ అని నిర్ధారణ చేసినట్లు తెలిపారు. చిన్నారికి 9 నెలల పాటు 14 కీమో థెరపీ సెషన్స్ ద్వారా చికిత్స చేశామని పేర్కొన్నారు. బెంగళూరు మణిపాల్ హాస్పటల్ ఆర్థోపెడిక్ అంకాలజీ విభాగం లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీమంత్, విజయవాడ మణిపాల్ హాస్పటల్ ఆర్థోపెడిక్ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జీవీ రెడ్డిలు చిన్నారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని క్యాన్సర్‌ను నియంత్రిస్తూ, ఎటువంటి సమస్యలు రాకుండా శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు.

భూ సమీకరణ గ్రామ సభలు నేడు

తాడికొండ: మండలంలోని పాములపాడు, రావెల, బేజాత్పురం రెవెన్యూ గ్రామాల పరిధిలో గురువారం భూ సమీకరణ నిమిత్తం సీఆర్డీయేకు ఇచ్చేందుకు భూ సమీకరణ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మెహర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పాములపాడు, 10:30 గంటలకు బేజాత్పురం, మధ్యాహ్నం 12 గంటలకు రావెల గ్రామాల్లోని సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నామని ఆయన అన్నారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు హాజరు కావాలని ఆయన తెలిపారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోండి

తెనాలిఅర్బన్: టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని హైద్రాబాద్ వాసులు రమేష్, అభిమన్యులు పేర్కొన్నారు. ది తెనాలి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో బుధవారం ఎ–1 ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో అనేక నూతన టెక్నాలజీ వస్తుందన్నారు. దానిని అందిపుచ్చుకుంటూ వృత్తిలో రాణించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మేడేపల్లి ప్రభాకర్, చిలకా రఘుకుమార్, భూపాల్, గట్టా శ్రీనివాసరావు, వేంపాటి శ్రీకాంత్, రవిశంకర్, గిరీష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: తనను భర్త అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైంది. పట్టణ నందులపేటకు చెందిన జరీనా, ముజీబ్ బాషాలకు పదేళ్ల క్రితం వివాహమైనా పిల్లలు లేరు. ఇటీవలి కాలంలో తనను భర్త అదనపు కట్నం తెమ్మంటూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆమె పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు బుధవారం నమోదు చేశారు.

న్యాయం కోసం అత్తింటి ముందు మౌన పోరాటం

పెదకాకాని: కుటుంబ పోషణ కోసం అత్తవారి ఇంటి ముందు నిరసన తెలియజేసినా కనికరించడం లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు స్వప్న వివరాల ప్రకారం.. ఉప్పలపాడుకు చెందిన పెద్ది ప్రసాదరావు, సులోకతార దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమారుడు పెద్ది రాజేష్‌కుమార్‌కు పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం అవిశాయపాలెంకు చెందిన స్వప్నతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఏడాదిన్నర కిందట రాజేష్‌కుమార్ అనారోగ్యంతో మరణించాడు. మృతుడు రాజేష్ పేరిట గ్రామంలో ఉన్న ఆస్తిని కుటుంబ పోషణకు ఇవ్వాలని స్వప్న పలుమార్లు కోరినప్పటికీ అత్తింటి వారు కనికరించలేదు. దీంతో స్వప్న బుధవారం ఉప్పలపాడు అత్తింటి ఆవరణలో మౌన పోరాటం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెదకాకాని పోలీసులు నచ్చచెప్పగా ఆమె స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వణికిస్తున్న ‘డై’యేరియా

- తెనాలిలో ప్రబలుతున్న వ్యాధి
- రోజూ 40 నుంచి 50 మందికి చికిత్స
- పెరుగుతున్న జ్వర పీడితుల సంఖ్య
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

తెనాలి అర్బన్: నియోజకవర్గంలో డయేరియా ప్రబలుతోంది. వాంతులు, విరోచనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ తెనాలి పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలలకు చికిత్స నిమిత్తం వస్తున్నారు. వాతావరణంలో మార్పులతో విష జ్వరాలు కూడా పెరుగుతున్నాయి. తెనాలి జిల్లా వైద్యశాలలో రోజుకు వెయ్యి మంది, అర్బన్ హెల్త్ సెంటర్లలో సుమారు 400 మంది, తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలోని వైద్యశాలలో సుమారు 250 మంది వరకు చికిత్స పొందుతుంటారు. తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలోని ప్రజలకు అత్యవసర వైద్య సేవలు పొందాలంటే తప్పనిసరిగా జిల్లా వైద్యశాలకు వచ్చి చికిత్స పొందుతుంటారు.



తెనాలి జిల్లా వైద్యశాల వార్డులో డయేరియా, జ్వర పీడితులు

ప్రబలుతున్న డయేరియా

తెనాలి పరిధిలో ఇటీవల డయేరియా కేసులు పెరుగుతున్నాయి. వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో ఎక్కువగా జిల్లా వైద్యశాలకు వచ్చి చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజు ఇలాంటి కేసులు 15 నుంచి 20 వరకు ఓపీ కింద నమోదు అవుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇన్ పేషెంట్‌లుగా ప్రతిరోజు ఏడుగురు వరకు చేరుతున్నారు. వీరందరికీ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు.

పెరుగుతున్న జర్వాల కేసులు

వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల ఇప్పుడిప్పుడే ప్రజలు జర్వాల బారిన పడుతున్నారు. తరచు వర్షాలు పడుతుండటంతో తెనాలి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రతిరోజు సుమారు 30 మంది వరకు వచ్చి చికిత్స పొందుతున్నారు. కొద్దిరోజుల్లో అధికారులు పంటకాల్వలు వదిలే అవకాశం ఉంది. అది జరిగితే దోమల వ్యాప్తి పెరిగి జర్వాల సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి



తెనాలి పరిధిలో ప్రజలు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడుతూ వస్తున్నారు. దీనికి కారణం కలుషిత ఆహారం, నీరు అనే చెప్పవచ్చు. ప్రజలు బయట ఫుడ్‌ను పూర్తిగా ఆపేయాలి. అలాగే కాచి చల్చార్చిన నీటిని తాగాలి. అలాగే ఇంట్లో వండిన ఆహార పదార్థాలను తీసుకోవాటం వల్ల చాలా వరకు రోగాలు దరిచేరవు. అలాగే దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలందరు వర్షాలు కురిసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.
–డాక్టర్ టి.వినీల్, ఫిజిషియన్, తెనాలి జిల్లా వైద్యశాల.

ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం



తెనాలి జిల్లా వైద్యశాలకు ఎక్కువగా డయేరియాతో బాధపడే వారు వస్తున్నారు. అవసరమైన వారికి అన్ని రకాల పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్యశాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అలాగే అన్ని రకాల పరీక్షలు చేసేందుకు అవసరమైన అత్యాధునిక ల్యాబ్ ఉంది. ఎటువంటి పరిస్థితి ఎదురైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.
–డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి.

రోటరీ క్లబ్‌కు అవార్డులు రావడం అభినందనీయం

మంగళగిరి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరికి 25 అవార్డులు రావడం అభినందనీయమని 2024–25 సంవత్సరపు క్లబ్ పూర్వ అధ్యక్ష కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహన్‌రావులు అన్నారు. గణపతినగర్‌లోని రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 29న హైదరాబాద్‌లో జరిగిన రోటరీ జిల్లా 3,150 అవార్డ్స్ నైట్ ఎక్స్‌ట్రా మైలర్స్ కార్యక్రమంలో అవార్డులను కైవసం చేసుకోవడం సంతోషదాయకమని అన్నారు. రోటరీ యాక్షన్ ప్లాన్ ఛాంపియన్‌తో సహా పలు విభాగాల్లో ప్రతిష్టాత్మక గోల్డ్ అవార్డులు, పలు అంశాల్లో సిల్వర్ అవార్డులు, ప్రశంసా పత్రాలు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కైవసం చేసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్, సెక్రటరి నిరంజన్ గుప్త, డైరెక్టర్లు శ్రీనివాసరావు, సుందరయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన అవార్డులతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు

నట్టల నివారణతో వ్యాధి నిరోధక శక్తి పెంపు

ఫిరంగిపురం: జీవాలకు నట్టల నివారణ మందు అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఫిరంగిపురం పశువైద్యాధికారి సాల్మన్ సింగ్ అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెం గ్రామంలో 890 గొర్రెలు, 200 మేకలకు నట్టల నివారణ మందు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అందజేసే మందులను పశువుల కాపరులు వినియోగించుకోవాలన్నారు. మండలంలోని పానుగుపాడు గ్రామంలో నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో 950 గొర్రెలు, 100 మేకలకు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ నట్టల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కాలువలో పడి యువకుడు మృతి

తాడికొండ: ప్రమాదవశాత్తు యువకుడు కాలువలో పడి మృతి చెందిన ఘటన పెదపరిమి–నీరుకొండ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం లేమల్లె గ్రామానికి చెందిన మేకల లక్షణరావు(26) మంగళగిరి అక్షయ పాత్ర వాటర్ ప్లాంట్ అపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 30వ తేదీ ఇంటి నుంచి బయలుదేరి వస్తూ పెదపరిమి–నీరుకొండ గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు.ఘటనా స్థలాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబురావు తెలిపారు.

విద్యుత్ తీగలను తాకేలా చెట్టు కొమ్మలు!

దుగ్గిరాల మండలం మంచికలపూడి వద్ద తెనాలి–విజయవాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను తాకుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకడంతో ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయే అవకాశం ఉంది. ద్విచక్ర వాహనదారులు చెట్ల కింద నిలబడిన సందర్భాల్లో వారిపై విద్యుత్ తీగలు పడే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. విద్యుత్ అధికారు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను ముందుగానే నియంత్రించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– దుగ్గిరాల



మురుగు కాల్వలపై ఎటుంటి కట్టడాలు నిర్మించవద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలపై ర్యాంప్‌లు, బండలు ఏర్పాటు చేయటం వల్ల కాల్వల మరమత్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటిపై ఎటువంటి కట్టడాలు నిర్మించవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 4,5 వార్డులలో బుధవారం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఎక్కువ మంది కాల్వలపై ర్యాంప్‌లు ఏర్పాటు చేయడాన్ని గమనించిన ఆమె సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు ఇప్పటి వరకు వాటిని తొలగించలేదని ప్రశ్నించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. కాల్వలను ప్రతిరోజు కార్మికులు బాగు చేయాల్సి ఉంటుందని, అలా చేయపోతే నీరు పారుదల లేక ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్‌లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, తోట రఘురామ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



కాల్వలపై ఆక్రమణలు తొలగింపజేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

మలినేని మహిళా కళాశాల డైరెక్టర్ నియామకం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్‌గా డాక్టర్ కోమటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. స్థానిక కళాశాలలో బుధవారం నూతనంగా నియమితులైన డైరెక్టర్‌కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మలినేని కళాశాలల చైర్మన్ పెరుమాళ్లు డైరెక్టర్ వెంకటేశ్వరరావును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కళాశాల విద్య, పరిశోధన, నూతన ఆవిష్కరణల్లో ముందుకు సాగేందుకు కోమటి అనుభవం ఒక దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. వెంకటేశ్వరరావు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ డిగ్రీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పొందారని గుర్తు చేశారు. విద్యారంగంతో పాటు ఐటీ, ఇస్రో వంటి ప్రఖ్యాత ప్రభుత్వ సంస్థల్లో కూడా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జెట్టి అప్పారావు, డీన్లు డా.పోపూరి రమేష్, ప్రొఫెసర్ జంపని కిషోర్ బాబు, ఇతర విభాగాధిపతులు, సీనియర్ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.



డాక్టర్ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు

సదాశివరావు సేవలు ఎనలేనివి

ఫిరంగిపురం: పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎస్ఐ సదాశివరావు చేసిన సేవలు ఎనలేనివని సీఐ శివరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో పదవీ విరమణ పొందిన ఎస్ఐ సదాశివరావు దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. అలాగే బదిలీపై ఇక్కడి నుంచి ఇటీవల పలు స్టేషన్‌లకు వెళ్లిన సిబ్బంది నాగేశ్వరరావు, శివాజీ, శ్రీనివాసరావులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, రైటర్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఐ సదాశివరావు దంపతులను సన్మానిస్తున్న సీఐ శివరామకృష్ణ

మలేరియా హెల్త్ అసిస్టెంట్ మృతి

తెనాలిఅర్బన్: తెనాలి మలేరియా కార్యాయంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుత్తికొండ మహేష్ బాబు (45) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, పలువురు అధికారులు ఆయకు నివాళులర్పించారు.